క్లుప్తంగా

మిరప సాగులో మెళకువలు పాటించాలి

తాళ్లూరు (ముండ్లమూరు): శీతాకాలంలో మిరప పంట సాగు చేసే రైతులు మెళకువలు పాటించాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని బొద్దికూరపాడులో శనివారం క్షేత్ర పర్యటన నిర్వహించారు. సిబ్బంది అజ్మీర్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

యర్రగొండపాలెం: మండలంలోని తమ్మడపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు విశ్వకర్మ జయంతి

యర్రగొండపాలెం: స్థానిక గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం మది వ్రాట్ విశ్వకర్మ భగవానుని జయంతి జరపనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 6 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, 7.30 గంటలకు పతాకావిష్కరణ, 8 గంటలకు దీక్షధారణ, అంకురార్పణ, వాస్తు, నవగ్రహ, యోగిని, క్షేత్రపాలక, సర్వసుభద్ర మండల ఆహ్వానం, వ్రతం, మంత్ర పుష్కరతీర్థ ప్రసాద వినియోగం, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి భక్తులకు అన్నసంతర్పణ ఉంటుందని పేర్కొన్నారు.

ఆటోనగర్ సమావేశానికి హాజరు కావాలి

దర్శి: ది ఆటోమొబైల్ టెక్నీషియన్ వర్కర్స్ ఇండస్ట్రియల్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ దర్శి నగర పంచాయతీలోని ఆటోనగర్‌లో సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు వెన్నపూస నరసారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

రాచర్ల: రోడ్డు ప్రమాదంలో యువకుని స్వల్ప గాయాలైన సంఘటన మండల కేంద్రం స్థానిక పోలీసుస్టేషన్ ఎదురుగా శనివారం మధ్యాహ్నం జరిగింది. వివరాలు..చోళ్లవీడు గ్రామానికి చెందిన నరసింహ అనే యువకుడు పోలీసుస్టేషన్‌లో పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్ జారడంతో కింద పడ్డాడు. తలకు స్వల్ప గాయాలయ్యాయి. మోటారు సైకిల్‌పై నుంచి కిందపడి దాదాపు గంట సమయం జరినా ఎవరూ స్పందించకపోవడంతో అటు వెళ్తున్న కొంతమంది యువకులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఆ యువకుడిని వెంటనే రాచర్లలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

వ్యాపారులకు న్యాయం చేయాలని నిరసన


కంభం: మార్కెట్‌లో కాకుండా బయట కూరగాల దుకాణం ఏర్పాటు చేయడంతో తాము నష్టపోతున్నామంటూ శనివారం కంభం కూరగాయల మార్కెట్ వ్యాపారులు స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ తాము వేలకు వేలు పాట పాడుకొని అద్దెలు చెల్లిస్తున్నామని, పంచాయతీ నిబంధనల ప్రకారం మార్కెట్ బయట దుకాణాలు పెట్టుకోకూడదని వాపోయారు. బస్టాండ్‌లో కూరగాయల కొట్టు ఏర్పాటు చేయడంతో తాము నష్టపోతున్నామని, అద్దెలు చెల్లించే పరిస్థితి లేదని వారు అధికారుల ఎదుట వాపోయారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని పంచాయతీ కార్యాదర్శి బ్రహ్మయ్య, సర్పంచ్ పల్నాటి బోదయ్య వారికి చెప్పి ఆందోళనను విరమింపచేశారు.

ఎన్నికల పనుల్లో అప్రమత్తంగా ఉండాలి


రాచర్ల: ఎన్నికల పనుల్లో రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రామసుబ్బాయ్య అన్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ఓటర్ల నమోదు ప్రక్రియ విధానాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం-6, ఫారం-7, ఫారం-8 సంబంధించిన 2700 దరఖాస్తులు వచ్చాయని, వీటిని త్వరగా పరిశీలించి వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. గిద్దలూరు నియోజకర్గంలోనే ఓటర్ల ప్రక్రియలో రాచర్ల రెవెన్యూ అధికారులు అలస్యం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఎం.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

కొనకనమిట్ల: సీసీకేఆర్ చిట్ ఫండ్ సంస్థ ద్వారా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గోడ గడియారాలు అందజేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎంఈఓలు ఎస్‌కే దాంగేషరీఫ్, నరసింహారావు అన్నారు. శుక్రవారం కొనకనమిట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గోడ గడియారాలు అందజేశారు. ఒంగోలు, పొదిలి సంస్థ బ్రాంచి మేనేజర్లు సుధాకర్, మందలపు శ్రీనివాసులరెడ్డి, హెచ్‌ఎం సుజాత, సంస్థ సభ్యులు మహేష్ పాల్గొన్నారు.



గోడ గడియారం అందజేస్తున్న ఎంఈఓలు



దర్శి: పాఠశాలలో ప్రదర్శన చేస్తున్న విద్యార్థిని



మార్కాపురం: మట్టి విగ్రహాలు తయారు చేస్తున్న విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు

మార్కాపురం టౌన్: పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను వాడాలని అరవింద స్కూల్ కరస్పాండెంట్ సి. వాణి అన్నారు. ముందస్తు వినాయకచవితి పండగను పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులతో మట్టి విగ్రహాలను శనివారం తయారు చేయించారు. ఆమె మాట్లాడుతూ భూ కాలుష్య నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించి నిమజ్జనం చేయాలన్నారు.

అనుమతి తీసుకోవాలి

ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే గణేష్ నవరాత్రుల్లో భాగంగా మండపాల నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ బీమా నాయక్ శనివారం తెలిపారు. కమిటీ సభ్యులు చందాలు బలవంతంగా వసూలు చేయకూడదని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన విగ్రహాలను కాకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలను వాడాలని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని, ఊరేగింపు సమయంలో అశ్లీల పాటలు, డ్యాన్సులు, మందుగుండు సామగ్రి పేల్చితే చర్యలు తీసుకుంటామన్నారు.

మార్కాపురం: పట్టణంలో విఘ్నేశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత వినాయక విగ్రహాలను కమిటీ అధ్యక్షులు గోపాలుని హరిహరరావు సాయిబాబా ఆలయంలో శనివారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిటీలో సభ్యులు బాధ్యత వహించాలని కమిటీ ప్రధాన కార్యదర్శి దేవిశెట్టి శేఖర్ కోరారు. కమిటీ సభ్యులు డి. రాములు, సుబ్రమణ్యం, మోహన్, నారాయణ, వెంకటేష్, శివశంకర్, వీరారావు పాల్గొన్నారు.

పట్టణానికి వినాయక చవితి శోభ వచ్చింది. ఈనెల 18వ తేదీన వినాయక చవితి పండుగను ప్రజలు జరుపుకోనున్నారు. పలువురు వ్యాపారులు పట్టణంలోని సీపీఐ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, రాయవరం వద్ద , ప్రెస్‌క్లబ్ వద్ద వినాయకుని విగ్రహాలను విక్రయిస్తున్నారు.

కురిచేడు: వినాయక చవితి మండపాలకు పోలీస్ అనుమతి తప్పనిసరని ఎస్సై ఎం. దేవకుమార్ శనివారం తెలిపారు. తేదీ, సమయం, మార్గం, వాహన వివరాలను తెలియజేయాలన్నారు.

దర్శి: మట్టి గణపతినే పూజిస్తామంటూ కట్టశింగన్నపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రచార ప్రదర్శన చేశారు. ఉపాధ్యాయుడు గొర్రెపాటి వేణు సహకారంతో పాత అట్టపెట్టెను ఎల్‌ఈడీ టీవీలా తయారు చేసి ఒక విద్యార్థిని న్యూస్ రీడర్‌గా.. పర్యావరణ హిత వినాయకున్ని పూజించడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు సి. సుధాకరరావు, ఉపాధ్యాయులు సయ్యద్ సుభాని, సీహెచ్ హైమావతి పాల్గొన్నారు.

మట్టి గణపతులతో పర్యావరణానికి మేలు

యర్రగొండపాలెం: మట్టితో తయారు చేసిన గణపతులతో పర్యావరణానికి ముప్పు ఉండదని ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ అన్నారు. శనివారం స్థానిక రెయిన్‌బో హైస్కూల్లో ముందస్తు వినాయక చవితి వేడుకల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మట్టితో చేసిన గణపతుల బొమ్మలను పండగ జరుపుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గణపతి చిత్రపటాలు గీసిన విద్యార్థులకు ఆయన మట్టి గణపతులు బహూకరించారు. ప్రిన్సిపాల్ నిఖిలా కిరణ్, ఉపాధ్యాయులు చంద్ర, రవి, సింహా పాల్గొన్నారు.

నేడు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పలు ఆలయాల కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకుడి విగ్రహాలను ఆదివారం ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు యర్రారెడ్డి, సోమయ్యలు శనివారం తెలిపారు. వినాయక చవితి పండగ సందర్భంగా మొత్తం 5 వేల మట్టి వినాయకుడి విగ్రహాలను పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయం, రాచర్ల రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, విశ్వభారతి స్కూల్, నగర పంచాయతీ కార్యాలయం, వేణుగోపాలస్వామి ఆలయం, రాచర్ల మండల కేంద్రంలోని రామాలయం, కొమరోలు మండల కేంద్రం శివాలయం, వంటి ప్రాంతాల్లో మట్టి వినాయకుడి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పండగ నిర్వహించుకునే వారు మట్టి వినాయకుడి విగ్రహాలు ఉచితంగా తీసుకోవచ్చన్నారు.



మార్కాపురం: నిర్వాహకులకు విగ్రహాలు అందిస్తున్న కమిటీ సభ్యులు



మట్టి గణపతులతో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్



పంపిణీకి సిద్ధంగా ఉన్న మట్టి వినాయకుడి విగ్రహాలు

అన్ని వర్గాల్లో ఆనందం నింపాం



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

● ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

రాచర్ల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం నింపగలిగామని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని కాలువపల్లె సచివాలయం పరిధి రాచర్ల ఫారం గ్రామంలో శనివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ, రాచర్ల సర్పంచ్ సగినాల రాయలమ్మ, వైస్ ఎంపీపీ చిట్టెం ఎలీశమ్మ, ఉప సర్పంచ్ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ పగడాల దేవి, శ్రీరంగం, జేఏసీ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, రామాపురం సొసైటీ అధ్యక్షుడు మదిరె శ్రీరంగారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టెం మార్క్, ఆకవీడు మాజీ సర్పంచ్ సూర పాండురంగారెడ్డి, ఓబుల్‌రెడ్డిపల్లె పాండురంగారెడ్డి, సగినాల సాయిలు, ఎంపీడీవో కె.కవితా చౌదరి, తహసీల్దార్ ఎం.దిలీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్, మండలంలోని మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అన్నా ప్రత్యేక పూజలు

కొమరోలు: స్థానిక ప్రశాంతి స్కూల్లో వారం నుంచి కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చివరి రోజు శనివారం కృష్ణుడి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అన్నా రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట నాయుడు, ఎంపీపీ కామూరి అమూల్య, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, వినియోగదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి వెంకటేశ్వరరావులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే అన్నా రాంబాబు

సీఎం సహాయనిధి ఎల్‌ఓసీ అందజేత



సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీ అందజేస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు: అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.10 లక్షల ఎల్‌ఓసీని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శనివారం నరజాములతండాలో జరుగుతున్న గడప గడపకు కార్యక్రమంలో బాధితునికి అందచేశారు. త్రిపురాంతకం మండలం టి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన చిలకల పెద్ద బ్రహ్మయ్యకు అనారోగ్యంగా ఉండటంతో యశోధ వైద్యశాలలో చేరారు. వైద్యం కోసం ఖర్చు అధికమవుతుందని మంత్రి సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం సహాయనిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీని మంత్రి అందజేశారు. సకాలంలో స్పందించి ఆదుకున్న మంత్రి సురేష్‌కు బ్రహ్మయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పార్టీ కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వాగ్యా నాయక్, నాయకులు సుబ్బారెడ్డి, బాలునాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు

తర్లుపాడు: మునుపెన్నడూ లేని విధంగా మండలంలో సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నట్లు ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్లు, మిల్క్ సెంటర్ల నిర్మాణాల పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం కేటాయించిన 20 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్లతో పాటు పలు అభివృద్ధి కార్య క్రమాలు చేసినట్లు వివరించారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీరు అందించనున్నట్లు చెప్పారు. పలు పథకాల ద్వారా కోట్ల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. అధికారులు అజెండాలోని అంశాలను సభకు వివరించారు. పశు వైద్యాధికారిని నందన మాట్లాడుతూ పశువులకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సింధూజ మాట్లాడుతూ జగనన్న వైద్యసురక్ష సమర్థవంతంగా నిర్వహిస్తామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భూలక్ష్మి

సమస్యలు పరిష్కరించండి

తుమ్మలచెరువు సర్పంచ్ షాజహాన్ మాట్లాడుతూ రెండు ట్యాంకులు నిర్మించాలని సభ దృష్టికి తీసుకుని వచ్చారు. ఇంటింటికీ కుళాయిలు వేశారని, విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో పథకం ప్రారంభం కాలేదని సూరెపల్లి సర్పంచ్ నవ్య అధికారులను ప్రశ్నించారు. ఏఈ జ్యోతి, పీఆర్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ నరసింహులు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మురారి తేజోరమ్మ, విద్యుత్ ఏఈ హనుమాన్‌నాయక్, ఎంఈఓ డి. సుజాత, హౌసింగ్ ఏఈ నిర్మల్‌బాబు, అగ్రికల్చర్ ఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

● మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి

కంభం: వినాయక పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి అన్నారు. మంగళవారం వినాయక నిమజ్జనం నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో మతపెద్దలతో ఆయన శాంతి సంఘ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం జరుగుతున్న చారిత్రాత్మక కంభం చెరువులో పుష్కలంగా నీరు ఉండటంతో విగ్రహాలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పోలీసుల సూచనల ప్రకారం కమిటీ వారు నడుచుకోవాలన్నారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచే నిమజ్జనాలకు బయల్దేరాలని సాయంత్రం 6.30 గంటల లోపల నిమజ్జనం కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలన్నారు. కంభం చెరువు కట్టపైకి వెళ్లిన తర్వాత విగ్రహాలను అక్కడ ఉన్న సిబ్బందికి అప్పగించాలని సూచించారు. గ్రామోత్సవంలో భాగంగా ప్రార్థన మందిరాలు, మసీదులు, ఇతర సున్నిత ప్రదేశాల్లో సంయమనం పాటించాలని సూచించారు. అనంతరం మత పెద్దలు సూచనలు, సలాహాలు విన్నారు. కంభం సీఐ ఎం.రాజేష్ కుమార్, కంభం, అర్ధవీడు ఎస్‌ఐలు పులి రాజేష్, నాగమల్లేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మత పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి

దొనకొండ: గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బడుగు, బలహీన జీవుల సమస్యల పరిష్కారానికి సీపీఐ అండగా నిలబడుతుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు అన్నారు. దర్శి నియోజకవర్గం వ్యవసాయ కార్మిక సంఘం ద్వితీయ మహాసభ దొనకొండ మండలం రుద్రసముద్రంలో శనివారం కూరేటి బాలయ్య అధ్యక్షతన జరిగింది. మాడపాకుల రమేష్‌బాబు, చెన్నుబోయిన గురుమూర్తి, కె.హనుమంతరావు, జూపల్లి కోటేశ్వరరావు, కరుణానిధి, మరియదాసు, కాశయ్య, యేసోబు పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం సమీపం సాయిబాబా మందిరంలో నూతనంగా ఆలయ ఫౌండర్ దివంగత డాక్టర్ జేవీ నారాయణ పేరుమీదుగా కల్యాణ మండపాన్ని ఆయన కుమారుడు, ధర్మకర్త డాక్టర్ జేవీ నారాయణ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయి సేవా సమితి సభ్యులు విష్ణు సహస్రనామాలను భక్తితో పఠించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి

బేస్తవారిపేట: అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పౌష్టికాహారం అందిస్తున్నామని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.గాలెమ్మ అన్నారు. శనివారం మండలంలోని జెన్నివారిపల్లెలో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. స్థానికంగా లభించే చిరుధాన్యాలు, ఆకుకూరలతో వండిన వంటలు ప్రదర్శించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఉప సర్పంచ్ పెద్ద కాశయ్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష సర్వే ప్రారంభం

పొదిలి రూరల్: మండలంలోని మల్లవరంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ రెడ్డె బోయిన సుబ్బయ్య ప్రారంభించారు. ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలను యాప్‌లో నమోదు చేశారు.

పంట నమోదు గడువు పెంపు

కురిచేడు: రైతులు తాము సాగు చేసినపంటలను ఆన్‌లైన్ చేసుకొనేందుకు ఈనెలాఖరు వరకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి పి. మధుబాబు శనివారం తెలిపారు. కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కమిషన్ నియామకం హర్షణీయం

మార్కాపురం: దేశంలో వెనుకబడిన ముస్లింల కోసం ప్రధాని మోదీ ఆలోచించడం ఆనందదాయకమని బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర నూర్‌బాషా సంఘం యూత్ అధ్యక్షుడు డీపీ మస్తాన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముస్లింలపై అధ్యయనం కోసం రోహిణీ కమిషన్‌ను నియమించారన్నారు. కమిషన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా దూదేకుల సంఘాల వారు విజ్ఞాపన పత్రాలు అందించారన్నారు. దూదేకుల మస్తాన్ రాష్ట్రంలో ముస్లింల సమస్యలను సీఎం దృష్టికి రాష్ట్ర సంఘ అధ్యక్షుడు పీర్ మహమ్మద్ ద్వారా తీసుకెళ్లామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దస్తగిరి, మహమ్మద్ ఆలీ, బాబూ సాహేబ్, హుస్సేన్, నూర్‌బాషా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నూతన పింఛన్ల పంపిణీ

మార్కాపురం టౌన్: ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పింఛన్లను 27వ బ్లాక్‌లో కౌన్సిలర్లు నగేష్, చంద్ర శనివారం పంపిణీ చేశారు. 27వ బ్లాక్‌లో మంజూరైన పింఛన్లను వారి ఇంటి వద్దకే వెళ్లి వార్డు కౌన్సిలర్ నగేష్, 25వ వార్డులో మంజూరైన పింఛన్‌ను వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్‌లు లబ్ధిదారులకు నగదు అందచేశారు. డి. వెంకటేశ్వర్లు, సిబ్బంది నాగేశ్వరరావు, తదితరులున్నారు.

జగనన్న పాల వెల్లువతో అభివృద్ధి

పొదిలి రూరల్: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా జగనన్న పాల వెల్లువ అమలు జరుగుతోందని ఉన్నగురువాయుపాలెం పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్ అన్నారు. శనివారం కుంచేపల్లి రైతు భరోసా కేంద్రంలో పాల వెల్లువ రుణ మేళా నిర్వహించారు. రూ. 40 వేల నుంచి రూ. 1.60 లక్షలు వరకు సొసైటీ బ్యాంక్ ద్వారా రుణాలు అందిస్తామన్నారు. ఏపీఎం మాణిక్యారావు, పీడీసీసీ బ్యాంక్ మేనేజర్ సూర్యనారాయణ, పేరం నాగిరెడ్డి రైతులున్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన

దర్శి: ఉద్యాన పంటలపై అవగాహన పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన పంటల శాస్త్రవేత్త డాక్టర్ ఎం. శివ తెలియజేశారు. స్థానిక కేవీకే సహకారంతో ఎస్సీ రైతులకు శనివారం మిరప నారు పంపిణీ చేశారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు పాటించాలన్నారు. రిసోర్స్ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ బోయిన వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

బెట్ట నివారణకు పూస హైడ్రోజన్

బేస్తవారిపేట: బెట్ట పరిస్థితులు తట్టుకుని మొక్కలకు అవసరమైన తేమ, పోషకాలను అందించేందుకు పూసా హైడ్రోజన్ రసాయనం ఉపయోగపడుతుందని డీఆర్‌సీ ఏఓ శైలజరాణి, బేస్తవారిపేట ఏఓ జక్కం మెర్సీ తెలిపారు. మండలంలోని ఒందుట్లలో పూసా హైడ్రోజన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎకరా పొలంలో కిలో పూసా హైడ్రోజన్ రసాయనాన్ని ఒక ట్రక్కు పశువుల ఎరువుతో కలిపి లోతైన దుక్కులు దున్నాలని తెలిపారు. ఒందుట్లలోని ఓ రైతుకు ఈ రసాయనాన్ని ఉచితంగా అందచేసి ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నామన్నారు. రసాయనం భూమిలో ఉన్నప్పుడు వర్షం నీటిని తీసుకుని అవసరాన్ని మొక్కకు అందించనున్నట్లు పేర్కొన్నారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతులు తీసుకోవాలి

బేస్తవారిపేట: వినాయకచవితి సందర్భంగా మండలంలో విగ్రహాలు ఏర్పాటు చేసుకునేందుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ బి.నరసింహారావు సూచించారు. కనీసం ఐదుగురు సభ్యులతో కమిటీగా ఏర్పడి పోలీసుస్టేషన్‌లో వివరాలు ఇవ్వాలన్నారు. ఫైర్, విద్యుత్‌శాఖల అనుమతి పొందాలని, ఉత్సవం నిర్వహించే రోజులు, నిమజ్జనం తేదీ, ప్రదేశం వివరాలు అందించాలని కోరారు.

పింఛన్ల పంపిణీ

తర్లుపాడు: అవ్వా తాతల సంతోషం, వితంతు, ఒంటరి మహిళల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి అన్నారు. శనివారం తర్లుపాడు సచివాలయంలో నూతనంగా మంజూరైన 29 పింఛన్లను సర్పంచ్ పి. వరాలు, ఎంపీటీసీ వి. అంకమ్మతో కలిసి అందించారు. సెక్రటరీ అచ్యుతరావు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని తూర్పు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సాయంత్రం ఏపీటీఎఫ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి మాట్లాడారు. మండల శాఖ గౌరవ అధ్యక్షులుగా పోలంరెడ్డి సుబ్బారెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి. నాగరాజు, ఎస్. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు, ఆడిట్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

స్కూల్ భవనం మంజూరు చేయండి

తర్లుపాడు: పాఠశాల భవనం లేక విద్యార్థులు చర్చిలోనే విద్యనభ్యసిస్తున్నారనీ, నూతన భవనం మంజూరు చేయాలని కోరుతూ కలుజువ్వలపాడు సర్పంచ్ ఎం. శిఖామణి శనివారం ఎంపీడీఓ ఎస్. నరసింహులుకు, ఎంఈఓ సుజాతకు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పరిస్థితి గమనించారన్నారు. కౌన్సిల్ సభ్యులు రామసుబ్బారెడ్డి, మందా కొండారెడ్డి, ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జగన్నాథపురం సర్పంచ్ గంటా వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయనది ఏమనగా **కోటపాటి కాశీరావు** S/o. **వెంకట రమణయ్య,** R/o. యాచవరం గ్రామం, అర్ధవీడు మండలం, ప్రకాశం జిల్లా అను అతనిపై నా క్లయింట్లు అయిన (1) **పాతం శ్రీనివాసులు** S/o. **రమణయ్య,** R/o. మార్కాపురం టౌన్, ప్రకాశం జిల్లా అను వారు మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు **I.A.552/ 2023 in O.S. 473/2023** గా, మరియు (2) **బత్తుల సుబ్బారావు** S/o **వెంకటయ్య,** R/o. మొద్దులపల్లి గ్రామం, మార్కాపురం మండలం అను వారు మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు **I.A.551/2023 in O.S. 472/2023** గా దావాలు వేసి పైన తెలిపిన కోటపాటి కాశీరావుకు చెందిన ఆస్తులు అర్ధవీడు మండలం, యాచవరం గ్రామము, గన్నేపల్లి గ్రామ రెవిన్యూ ఇలాకా సర్వే నెంబర్లు 729/2లో య.2-20 సెంట్లు, 729/1లో య. 2-88 సెంట్లు, 495/2లో య.1-74 సెంట్లు, 492లో య. 1-20 సెంట్లు, 491 లో య. 1-43 సెంట్లు, 425 లో య. 2-63 సెంట్లు గల భూములకు అటాచ్‌మెంటు పొందియున్నారు. కావున పైన తెలిపిన భూములకు సంబంధించి ఎవరైనను కొనుగోలు చేసినను లేదా అమ్మకం జరిపినను వారికి ఎలాంటి హక్కు బదిలీ జరగదు. కావున ఈ నోటీసు ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది.

మధిరె మల్లికార్జునరెడ్డి, అడ్వకేట్, మార్కాపురం